## క్లుప్తంగా

### కార్యదర్శిని నియమించాలి

పెగడపల్లి: మండలంలోని నామాపూర్ గ్రామ పంచాయతీకి పర్మినెంట్ కార్యదర్శి లేక ఇక్కట్లు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ పని చేసిన కార్యదర్శి మూడు నెలల క్రితం బదిలీపై వెళ్లాడు. ఆయన స్థానంలో ఎవరిని నియామకం చేయకుండా పక్క గ్రామం మ్యాకవెంకయ్యపల్లి కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు గ్రామాలకు ఒక్కరే కార్యదర్శి కావడంతో సేవలు సక్రమంగా అందడం లేదని, పనుల నిమిత్తం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకెళ్లిన ప్రజలకు అందుబాటులో లేక పోవడంతో రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని, పరిపాలనపరమైన ఆటంకం కలుగుతుందని అంటున్నారు. జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యం జరుగుతుందని, తాగునీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణ తదితర వాటిపై పర్యవేక్షణ కొరవడిందని పర్మినెంటు కార్యదర్శిని నియమించాలని అధికారులను కోరుతున్నారు.

### నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని ఆలూరు గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేయూ ప్రతినిధులు సాయిరాజ్, చైతన్య, పాండు, రైతు సేవా కేంద్రం నిర్వాహకులు విజయ్, అజయ్, మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సతీశ్, ఉపాధ్యాయులు సాయికృష్ణ, శృతి పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



సూపర్‌వైజర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ

మల్యాల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3ను ఎంపీపీ ఆగంతపు రవళివంశీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ దీర్ఘకాలిక సెలవులో ఉన్నారని సూపర్‌వైజర్ రాజశ్రీ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్ల పరిమాణం చిన్నగా ఉన్నాయని, చిన్నారుల హాజరుశాతం పెంచాలని ఎంపీపీ అన్నారు. నూకపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరితాదేవి, ఉపాధ్యాయులు, నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలకు సహకారం అందించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నీలిమ

ఇబ్రహీంపట్నం: ఏకల్ అభియాన్ పాఠశాలలకు దాతలు సహకారం అందించాలని జగిత్యాల కార్యాలయ ప్రముఖ్ నీలిమ కోరారు. గురువారం మండలంలోని వేములకుర్తిలో మహిళలు, ప్రముఖులను కలిశారు. హన్మకొండలో శుక్రవారం జరిగే హిందూ ధర్మ పరిరక్షణ సమావేశానికి హాజరు కావాలని సమావేశ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంచల్ అభియాన్ ప్రముఖ్ భూమరెడ్డి, మెట్‌పల్లి డివిజన్ సంచ్ ప్రముఖ్ స్రవంతి, వేములకుర్తి గ్రామ మాతాజీ సందుపట్ల తనూజ, నాయకులు కొటగిరి వెంకటస్వామి, అంకతి శ్రీలక్ష్మి, సందుపట్ల మాలవిక, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



పనులు ప్రారంభిస్తున్న ఈవో ఎస్.శ్రీనివాస్

సారంగాపూర్: బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులను యుద్ధప్రతిపాదికన పూర్తిచేయాలని ఈవో ఎస్.శ్రీనివాస్ అన్నారు. గురువారం రూ.31 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పనులు పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఏఈ సంతోష్‌రెడ్డి, అధికారులు ప్రతాప్, రాంచందర్, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోషచార్యులు, చిన్న సంతోషచార్యులు, మధుకుమారచార్యులు పాల్గొన్నారు.

# మళ్లీ ముంపు భయం

- ఏటా వర్షాకాలంలో మునుగుతున్న కాలనీలు
- లోలెవల్ వంతెనలతో పొంచి ఉన్న ముప్పు



రాయికల్‌లో నీటమునిగిన కేశవనగర్(ఫైల్)



ఇటిక్యాల - రాయికల్ లోలెవల్ వంతెన పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు(ఫైల్)

రాయికల్: ఏటా వర్షాకాలంలో పట్టణంలోని పెద్ద చెరువుతో వరదతో ముప్పు ఏర్పడుతుంది. పట్టణ శివారు కాలనీలు నీటమునుగుతుండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పెద్దచెరువు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా రాయికల్, మైతాపూర్, చెర్లకొండాపూర్ గ్రామాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు ఎంతో దోహదపడుతుంది. వర్షాకాలంలో చెరువు నిండి వరదనీరు ఉప్పొంగి ప్రవహించినప్పుడు పట్టణంలోని 5,6,7 వార్డుల్లోని ఇళ్లలోకి నీరు చేరుతుంది. భీమన్నవాడ, మత్తడివాడ, గొల్లవాడ, కేశవనగర్ కాలనీవాసులు వానాకాలం వచ్చిందంటే ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా పెద్దచెరువు నిండినప్పుడు చెర్లకొండాపూర్, రాయికల్, మైతాపూర్‌లోని చెరువు కట్ట తీర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలు నీటమునడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోలెవల్ వంతెనతో వర్షాకాలంలో ప్రజలకు ముప్పు పొంచి ఉంది. చిన్న వర్షాలకు సైతం లోలెవల్ వంతెనలపై నుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలంలోని ఇటిక్యాల, మూటపల్లి, వస్తాపూర్, ధర్మాజీపేట, రామాజీపేట, గ్రామాల్లో లోలెవల్ వంతెనలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నివారణ చర్యలు చేపట్టి ముంపునకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

### రాకపోకలు నిలిచిపోతాయి



రాయికల్ నుంచి ఇటిక్యాలకు వెళ్లే దారిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో లోలెవల్ వంతెన ఉంది. దీంతో ఏటా వర్షాకాలంలో వరద నీరు వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిపోతాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– రొట్టె శ్రీధర్, ఇటిక్యాల

### ఇళ్లలోకి వరదనీరు వస్తోంది



రాయికల్ పట్టణంలో గతేడాది కురిసిన భారీ వర్షాలకు కేశవనగర్, గొల్లవాడ, మత్తడివాడ, భీమన్నవాడలోకి వరద నీరు చేరడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి. – ఎలిగేటి నారాయణ, కేశవనగర్, రాయికల్

### కలెక్టర్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవో నాయకులు

జగిత్యాల: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యప్రసాద్‌ను వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో పాటు, సీనియర్ సిటిజన్స్, వివిధ శాఖల అధికారులు, ట్రస్మానాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కథలాపూర్: కలెక్టర్‌ను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ రాంబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కథలాపూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావుఉన్నారు.

కోరుట్ల/జగిత్యాలక్రైం: కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీగా అశోక్‌ను కాంగ్రెస్‌పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.

### ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డికి గురువారం పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. స్కూళ్ల యజమానులు ఐఐటీ, నీట్, ఒలింపియాడ్, సీబీఎస్ఈ తదితర తోకపేర్లు తగిలిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రత్నం రమేశ్, రాకేశ్, నవీన్, సందీప్ పాల్గొన్నారు.



రాయికల్: బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



కథలాపూర్: చెరువుకట్ట వద్ద మున్నూరుకాపు రైతు సంఘం సభ్యులు

### ఘనంగా పోచమ్మ బోనాలు

రాయికల్: పట్టణంలోని ఒడ్డెరకాలనీవాసులు గురువారం పోచమ్మతల్లి బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో కాలనీ నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ, కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని భీంరాజీపల్లి గ్రామంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, యువకుల కేరింతల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. వర్షాలు కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఊటిపెల్లి గ్రామంలో ..**

కథలాపూర్: మండలంలోని ఊటిపెల్లి గ్రామంలో మున్నూరుకాపు రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కట్ట మైసమ్మ బోనాలు నిర్వహించారు. బోనాలతో మైసమ్మ గుడి వరకు ఊరేగింపుగా వచ్చారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

**వార్షికోత్సవానికి ఏర్పాట్లు**

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలోని గోదావరి తీరానున్న శ్రీసాయి శివబాలాజీ మందిరంలో ఈనెల 21 నుంచి 22 వరకు నిర్వహించే ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు వొజ్జల ప్రవీణ్‌శాస్త్రీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. 21న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విఘ్నేశ్వర పూజ, నవగ్రహ యోగిని, దేవత కలశ స్థాపన, గణపతి, నవగ్రహ స్థాపిత దేవత రుద్ర, మూలమంత్ర హోమం, సాయంత్రం పూర్ణాహుతి, హారతి, 22న ఉదయం 5 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కాగడ హారతి, ధ్వజారోహణ, పూర్ణాభిషేకం, హారతి, అన్న మహాప్రసాదం, పాదుక ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## బడుగుల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్‌బాపూజీ

- తెలంగాణ కోసం పదవులు త్యాగం చేసిన మహానేత
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఆవిష్కరించి తిలకం దిద్దుతున్న డాక్టర్ సంజయ్‌కుమార్

మల్లాపూర్: రాష్ట్రం కోసం పదవులు త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు సాంబారి ప్రభాకర్‌లతో కలిసి గురువారం ఆవిష్కరించారు. బడుగుల ఆశాజ్యోతి బాపూజీ త్యాగాలు భావితరాలకు తెలియాలని,ఆయన స్ఫూర్తితో పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలని, ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సరోజనఆదిరెడ్డి, ఎంపీటీసీలు రాజేష్, సత్తెమ్మమల్లయ్య, సీనియర్ నాయకులు, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు దశరథం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**నాణ్యమైన వైద్యం అందించాలి**

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఇప్పుడున్న 5 డయాలసిస్ బెడ్‌లకు అదనంగా మరో 5 బెడ్‌లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు. గురువారం ఆసుపత్రి కమిటీ సమావేశంలో పాల్గొని ఓపీ తదితర వివరాలు తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డాక్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు నెరవేర్చుతాం

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మల్యాల రైతువేదికలో గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తూ పథకాలు అమలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని, ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామన్నారు. త్వరలో కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రవళివంశీ, మండల స్పెషల్ ఆఫీసర్ వాణి, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీఓ స్వాతి, ఆర్‌ఐ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

### ప్రజాపాలన కొత్త దరఖాస్తులు స్వీకరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న జలపతి

గొల్లపల్లి: ప్రజాపాలన కొత్త దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీటీసీ గోవిందుల లావణ్య, జలపతి గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో వివిధ పథకాలకు నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నా కొందరికి ఆన్‌లైన్‌లో చూపించడం లేదని, ప్రజలు గ్యాస్ సబ్సిడీ, ఉచిత కరెంట్ పొందలేకపోతున్నారని వివరించారు. సమస్యలను పరిష్కరించి కొత్త దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.

## ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



కోరుట్ల రూరల్: ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కోరుట్లరూరల్: వరికి మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటాన్ని స్వాగతిస్తూ మున్సిపల్ పరిధిలోని ఎకిన్‌పూర్ గ్రామంలో బీజేపీ శ్రేణులు గురువారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, కేంద్రమంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్ నరేశ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కథలాపూర్: కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడం సంతోషకరమని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి అన్నారు. కథలాపూర్‌లో మాట్లాడారు. రైతులకు ఆర్థికంగా భరోసా కలుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం వరికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిందని, రూ.రెండు లక్షల రుణమాఫీ అమలుచేయాలన్నారు.

### అవగాహన సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హరి అశోక్ కుమార్

కోరుట్ల: సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రపంచ వయోవృద్ధులపై వేధింపుల నివారణ వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల రక్షణ, పోషణ, సంక్షేమ చట్టంపై సీనియర్ సిటిజన్లు, పెన్షనర్లు, వివిధ సంఘాల ప్రతినిధులకు రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్లు ముద్రించిన తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, అవగాహన కరపత్రాలు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పబ్బ శివానందం, కార్యదర్శి రాజ్‌మోహన్, కోశాధికారి నల్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ఎండీ సైఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

### వీడీసీ అధ్యక్షుడిగా గంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. 16 కులసంఘాల సభ్యులు సమావేశమై కమిటీ అధ్యక్షుడిగా ఎడిపెల్లి గంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గొడిసెల భూమేశ్‌గౌడ్, కోశాధికారిగా పుప్పాల నరేందర్, రైటర్‌గా దేవేందర్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

### లయన్స్‌క్లబ్ ధర్మపురి అధ్యక్షుడిగా రాపర్తి నర్సయ్య

ధర్మపురి: లయన్స్ క్లబ్ ధర్మపురి మండల అధ్యక్షుడిగా రాపర్తి నర్సయ్యను ఎంపిక చేసినట్లు జిల్లా 32ఓజీ మొదటి ఉపగవర్నర్ లయన్ కోదండరాములు తెలిపారు. పట్టణంలో గురువారం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడితో పాటు కార్యదర్శిగా స్తంభంకాడి రమేశ్, ట్రెజరర్ సీపతి రాజన్న ఉన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ధర్మపురిలో లయన్స్‌క్లబ్‌ను 2016లో ఏర్పాటు చేసి ఎంతో మందికి క్లబ్ తరఫున అనేక సేవలందించామని రాబోయే రోజుల్లో లయన్స్‌క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో లయన్ చెన్నమనేని సుధీర్‌రావ్, రాజేందర్, జెడ్సీ డాక్టర్ ఇందారపు రామకృష్ణ, సాయిని సత్యనారాయణ తదితరులున్నారు.

### అల్బెండజోల్ మాత్రల పంపిణీ

సాక్షి నెట్‌వర్క్: జగిత్యాల, కోరుట్ల, చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్కూల్, కాలేజీల్లో 19 ఏళ్లలోపు బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగులు వృద్ధి చెందడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఏర్పడి పిల్లల్లో ఎదుగుదల ఉండదని, ఆరోగ్యకరమైన వ్యక్తులతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని వైద్యాధికారులు, డాక్టర్లు పేర్కొన్నారు. మాత్రల పంపిణీలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి



పెగడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో...



మెట్‌పల్లి: మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



మెట్‌పల్లిరూరల్: మాత్రలేస్తున్న వైద్యాధికారి అంజిత్‌రెడ్డి

### బీమా కార్డులు అందజేత

రాయికల్: రాయికల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు గురువారం బీమా కార్డులను ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వాసరి రవి అందజేశారు. పాత్రికేయుడికి వ్యక్తిగత బీమా తప్పనిసరి అని, ఒక్కొక్కరికి రూ.10 లక్షల ప్రమాదబీమా కార్డులు అందజేశామన్నారు. ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, కోశాధికారి శేఖర్, ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి రఘుపతి, సంయుక్త కార్యదర్శి గంగధరి సురేశ్ పాల్గొన్నారు.



బీమా కార్డులు అందుకుంటున్న పాత్రికేయులు

### సన్మానం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పదోన్నతి పొందగా ఉపాధ్యాయ సంఘం సీనియర్ నాయకుడు సూద రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం అభినందనలు తెలిపారు. గ్రామానికి చెందిన సుమారు 25 మంది వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. బోగ రమేశ్, వెయ్య లచ్చన్న, గొడుగు రఘుపతియాదవ్, ఎడ్ల గోవర్ధన్, పి.కల్పన, మహమ్మద్ ఫక్రోద్దీన్ పదోన్నతి పొందారు.

**వానరానికి అంత్యక్రియలు**

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో వానరం అనారోగ్యంతో గురువారం మృతిచెందగా స్థానిక భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు అంత్యక్రియలు నిర్వహించారు. కళేబరాన్ని ఊరేగింపుగా గ్రామ శివారులోకి తీసుకెళ్లి ఖననం చేశారు. కార్యకర్తలు రణధీర్, రవి, రాజు, శ్రావణ్, నిఖిల్,అనిల్, రిషి పాల్గొన్నారు.